

ఘనంగా దసరా వేడుకలు

- శమీ పూజలు
- ఆలయాల్లో భక్తుల సందడి





మంథని లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో మంత్రి శ్రీధర్‌బాబు పూజలు, జిల్లా కేంద్రంలోని ఐటీఐ మైదానంలో వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణారావు, ఓదెల మల్లన్న ఆలయంలో షమీ పూజలు..

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 13 : విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లాకేంద్రంలో ఘణంగా సమీ పూజలు నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం, ఐటీఐ మైదానంలో జరిగిన షమీ పూజ వేడుకల్లో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు హజరై పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు జమ్మిచెట్టు వద్ద మొక్కలు సమర్పించుకోని జమ్మి ఆకును తెంపుకోని అలాయి బలాయి కార్యక్రమాలతో అలరింపజేశారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్ పర్సన్ మమతా రెడ్డి, మున్సిపల్ కమిషనర్, వార్డుల కౌన్సిలర్లు, పుర ప్రముఖులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విజయదశమిన పురస్కరించుకొని వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈసందర్భంగా పలు గ్రామాల్లో జమ్మిచెట్టును ఏర్పాటు చేసి షమీ పూజలు నిర్వహించారు. కోన్ని గ్రామాల్లో రావణదహనం నిర్వహించారు. షమీ పూజ అనంతరం జమ్మి ఆకును తెంపి అలాయ్‌బలాయ్‌తో దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గ్రామాల్లో దసరా సందర్భంగా ఎలాంటి గొడవలు జరగకుండా పండుగను ప్రశాంతంగా నిర్వహించుకున్నారు.

మంథని : దసరా వేడుకలను మంథని ప్రాంతంలో ప్రజలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి గ్రామాల్లోని పలు దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాలక్ష్మి, లక్ష్మీనారాయణస్వామి ఆలయాల్లో భక్తులు దర్శించుకున్నారు. మహాలక్ష్మిని, లలితాంభిక, వాసవి కన్యకాపరమేశ్వరిదేవి, లక్ష్మీనారాయణస్వామి అమ్మవార్లను అందంగా ఆలంకరించారు. రాత్రి లక్ష్మీనారాయణ స్వామితో ఉత్సవ మూర్తులను ప్రత్యేకరథంపై ఊరేగించారు. భక్తులు స్వామికి మంగళహారతులిచ్చి దర్శించుకున్నారు. స్వామివారు పురవీధుల ఊరేగింపుగా జమ్మి చెట్టు వద్దకు వెళ్లగా భక్తులు శ్రీలక్ష్మినారాయణస్వామి ఆలయం వద్ద వేచి చూశారు. ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన శ్రీ దుర్గామాతను భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని పలు శైవ, వైష్ణవ, అమ్మవారి, హనుమాన్, అయ్యప్పస్వామి ఆలయాల్లో సైతం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు స్థానిక కోర్టు సమీపంలోని జమ్మి చెట్టును దర్శించుకొని పెద్దల ఆశీర్వచనం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద భక్తులు తమ వాహనాలకు పూజలు చేయించుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ప్రజలంతా క్షేమంగా ఉండాలి : మంత్రి శ్రీధర్‌బాబు

మంథని ప్రాంత ప్రజలంతా క్షేమంగా ఉండాలని లక్ష్మీనారాయణ స్వామి, మహాలక్ష్మి అమ్మవార్లను వేడుకున్నట్లు మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు వెల్లడించారు. దసరా వేడుకల్లో మంత్రి శ్రీధర్‌బాబు శనివారం లక్ష్మీనారాయణస్వామి ఆలయానికి వచ్చి, ఉత్సవ మూర్తిని దర్శించుకోవడం తోపాటు భక్తులకు పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుర్గా మాతల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని ఆకాక్షించారు. ఆలయానికి వచ్చిన వారి వేదపండింతుల పూర్ణకుంభ స్వాగతం పలికి పూజల అనంతరం ఆశీర్వచనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెంద్రి రమ సురేష్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : దసరా పండుగ వేడుకలను సుల్తానాబాద్ పట్టణంలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో స్వామివారి రథయాత్ర ప్రారంభ పూజకు వచ్చిన ఎమ్మెల్యే విజ రమణారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజులు లక్ష్మీరాజమల్లు అంతటి అన్నయ్యగౌడ్, మాజీ జడ్పీటీసీ మినుపాల స్వరూప ప్రకాశ్‌రావు తదితరులను ఆలయ చైర్మన్ పల్లా మురళి సదాలక్ష్మిలు ఘనంగా సన్మానించారు. అనంతరం స్వామివారి రథాన్ని చెరువు వద్ద ఏర్పాటు చేసిన శమీ(జమ్మి) పూజ కోసం తీసుకెళ్లి, తిరిగి వస్తుండగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి మొక్కులు చెల్లించుకున్నారు. చెరువు వద్ద జరిగిన జమ్మి పూజలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత క్రిష్ణ, మాజీ సర్పంచ్ అంతటి అన్నయ్యగౌడ్, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఎస్ఐ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఓదెల : మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం నిర్వహించిన దసరా వేడుకలు ఘనంగా ముగిశాయి. భ్రమరాంబ మల్లికార్జున స్వామి, సీతారామచంద్రస్వామి, శివాలయంతో పాటు పొత్కపల్లి, కొలనూర్, కనగర్తి, మడక తదితర గ్రామాల్లోని క్షేత్రాల్లో అర్చకులు షమీ పూజలు నిర్వహించారు. అనంతరం జమ్మి పత్రిని ఇచ్చుకొని, పుచ్చుకొని అలింగనాలతో ఒకరికి కొకరు దసరా శుభాకాంక్షలు తెలిపారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు.

కాల్వశ్రీరాంపూర్ : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శనివారం దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండల కేంద్రంలో వేణుగోపాల స్వామిని ఊరేగింపు జరిపారు. అనంతరం జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో జమ్మి ఆకు తెంపుకొని ఒకరికొకరు అలాయ్ బలాయ్ తీసుకున్నారు. అనంతరం ప్రతి గ్రామంలో బంధువులతో ప్రతి ఇల్లు కలకలలాడింది. దసరా ఉత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ వెంకటేష్‌తో పాటు పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గ్రామాల్లో ప్రత్యేక అధికారులు, కార్యదర్శిలు దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమాలలో తాసిల్దార్ ఎండి వకీల్, ఎంపీవో గోవర్ధన్ పాల్గొన్నారు.

ఎలిగేడు : మండలంలోని శివపల్లి గ్రామంలో విజయదశమి వేడుకల్లో ఉత్సాహంగా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మిగతా 11గ్రామాల్లో దసర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతిమోహన్‌రావు, మాజీ జడ్పీ వైస్‌చైర్‌పర్సన్ మండిగ రేణుకరాజనర్సు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, తాటిపల్లి రమేష్‌బాబు, బూర్ల వెంకటసత్యం, అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, సింగిరెడ్డి రాంచంద్రరెడ్డి, పల్లెర్ల వెంకటేష్‌గౌడ్, కొండ తిరుపతిగౌడ్, అమ్ముల రమేష్ పాల్గొన్నారు.

జూలపల్లి : మండలకేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లోను శనివారం దసరా(విజయదశమి)వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన జమ్మిచెట్టుకు శమిపూజలు చేసి విజయదశమి సంబురాలు జరుపుకున్నారు. ప్రతి ఇంటిలోను కుటుంబ సభ్యులు బంధువుల రాకతో సందడిగా మారింది. దసరా వేడుకల్లో ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ శ్రీధర్ ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటుచేశారు. కాగా మండలకేంద్రంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శమిపూజలు నిర్వహించా. జంగపెల్లి రాజేష్, కొప్పుల మహేష్, సామల కిరన్, దర్మాచారి, మహిపాల్ పాల్గొన్నారు.

కమాన్‌పూర్ : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో శనివారం దసరా పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వేదపండితుల ఆధ్వర్యంలో శమీ వృక్షానికి పూజలు నిర్వహించి జమ్మి పత్రిని ఒకరినొకరూ పంచుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

యైటింక్లయిన్‌కాలనీ : విజయదశమి పర్వదినాన్ని కాలనీ వాసులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఇతర ప్రాంతాలలో ఉద్యోగాలు చేస్తూ, చదువుకుంటున్న కార్మికుల పిల్లలు దసరాకు రావడంతో కాలనీలో సందడి నెలకొన్నది. సాయంత్రానికి పెద్దఎత్తున కాలనీవాసులు వెంకటేశ్వర దేవాలయంలో జమ్మి పూజలు చేసిన అనంతరం ఒకరికొకరు జమ్మి ఇచ్చుకుని దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. విశ్వకర్మ శివాలయం, ఓసీపీ-1 రోడ్డులోని గణేష్ నగర్, సివిల్ డిపార్ట్‌మెంట్ చౌరస్తాల వద్ద జమ్మి చెట్టుకు పూజలు చేశారు.



కమాన్‌పూర్‌లో శమీ పూజలు..





పెద్దబొంకూరులో శమీ పూజలో పాల్గొన్న గ్రామస్థులు, సుల్తానాబాద్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు, కాల్వశ్రీరాంపూర్‌లో రథం ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

గోదావరిఖనిలో అంబరాన్నంటిన దసరా సంబరాలు

- వేలాది మందితో కిక్కిరిసిన సింగరేణి స్టేడియం - ఆకట్టుకున్న ఫైర్ షో - కేరింతల మధ్య రావణ దహనం - పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే



ప్రదర్శన ఇస్తున్న కళాకారులు..



సింగరేణి స్టేడియంలో రావణ దహనం..



ఉత్సవాలకు భారీగా హాజరైన జనం

కళ్యాణ్‌నగర్/మార్కండేయకాలనీ, అక్టోబరు 13: గోదావరిఖనిలో దసరా సంబరాలు అంబరాన్నంటాయి. స్థానిక సింగరేణి స్టేడియంలో రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు నిర్వహించారు. సింగరేణి సంస్థ విస్తృత ఏర్పాట్లు చేసింది. గోదావరిఖనే కాకుండా యైటింక్లయిన్‌కాలనీ, ఎన్‌టీపీసీ ప్రాంతాలతో పాటు పరిసర గ్రామాల నుంచి ఉత్సవాలకు హాజరయ్యారు. జబర్దస్త్ టీమ్‌తో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సునామి సుధాకర్, పటాస్ ప్రవీణ్, శ్రీదేవి డ్రామా కంపెనీ నటి భవానిల హస్య ప్రదర్శన ఆకర్షణగా నిలిచింది. ఓదెలకు చెందిన పోతుగంటి శ్రీనివాస్‌గౌడ్ బృందం 108దీపాలతో ఒగ్గు కళా ప్రదర్శన నిర్వహించారు. వీరితో పాటు స్థానిక కళాకారులు కనకం రమణయ్య బోనాల డ్యాన్సు, సర్వేష్, సందీప్, వెంకి డ్యాన్స్ అకాడమిల కళాకారుల నృత్యాలు, జ్యోతిర్మయి బృందం శాస్త్రీయ నృత్యం, సింగరేణి కళాకారుల ఆర్కెస్ట్రా నిర్వహించారు. కే స్వామి సమన్వయకర్తగా వ్యవహరించగా, మేజిక్ రాజా వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ ఉత్సవాల్లో ఫైర్‌షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేలాది మంది కేరింతల మధ్య రావణ దహనం జరిగింది. రామగుండం శాసన సభ్యులు రాజ్‌ఠాకూర్, జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్, కలెక్టర్ కోయ శ్రీ హర్ష, సింగరేణి జీఎంలు లలిత్‌కుమార్, సూర్యనారాయణ, ఆర్ఎఫ్‌సీఎల్ జీఎం ఉదయ రాజహన్స్, ఏసీపీ రమేష్, తదితరులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ బాణం వదిలి రావణ దహనం చేశారు. వేలాది మంది జనం పాల్గొన్న ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.



అకాడ ప్రదర్శన నిర్వహిస్తున్న చిన్నారులు

ఆకట్టుకున్న అకాడ ప్రదర్శన

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 13: ప్రతి ఏటా దసరా సందర్భంగా గోదావరిఖని విద్యానగర్‌కు చెందిన జై భారత్ హనుమాన్ అకాడమీ వస్తాద్ మచ్చ శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించే అకాడ ప్రదర్శన ప్రజలను ఆకట్టుకున్నది. శనివారం సాయంత్రం విద్యానగర్ నుంచి స్టేడియం వరకు చిన్న పిల్లలు కర్రసాము, కత్తిసాము ప్రదర్శనలతో ఊరేగింపు నిర్వహించారు. వస్తాద్‌లు మచ్చవిశ్వాస్, సమ్మయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రామగుండాన్ని అభివృద్ధి చేసేందుకు 'రుడా'..

- దసరా వేడుకల్లో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, అక్టోబరు 13: రామగుండాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా)ను ప్రజలకు కానకగా తీసుకువస్తున్నామని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. శనివారం రాత్రి స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా ఉత్సవాల వేడుకల్లో ఆయన ప్రసంగించారు. రుడా రావడం వల్ల రామగుండం బీ క్యాటగిరి నగరంగా మారుతుందని, ఈ ప్రాంతంలోని కార్మికులకు, ఇతరులకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు అండగా ఉండి రామగుండాన్ని అభివృద్ధి వైపు తీసుకెళుతున్నారన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష, సింగరేణి సీఎండీ బలరాం నాయక్ ప్రతి విషయంలోనూ సహకరిస్తున్నారన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ పాలన అందిస్తుందన్నారు. ఐదు హామీలు నెరవేర్చడంతో పాటు లక్ష నియామకాలు చేశామన్నారు. రామగుండానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు విద్యుత్ కేంద్రాల స్థాపనతో పాటు ఉపాధి కల్పించడంపై దృష్టి పెట్టామన్నారు. మా కొలువులు మాకు కావాలనే నినాదంతో ముందుకు వెళుతున్నామన్నారు. ఊడ్చేపని నుంచి ఇంజనీరు పని అయినా స్థానికులకే ఇవ్వాలన్నదే తమ నినాదమన్నారు. రామగుండంలో రెండవ విడతలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు నెలకొల్పుతారన్నారు. మేయర్ బంగి అనీల్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్, కలెక్టర్ కోయ శ్రీహర్ష, స్థానిక కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్విని, ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్, ఆర్-2 జీఎం సూర్యనారాయణ, ఆర్ఎఫ్‌సీఎల్ జీఎం ఉదయ రాజహన్స్, కార్పొరేటర్లు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, అడ్డాల స్వరూప, ముస్తాఫా పాల్గొన్నారు.



ఉత్సవాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

పోలీస్ కమిషనరేట్‌లో ఆయుధ పూజ



ఆయుధ పూజ చేస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, అక్టోబరు 23: విజయదశమి సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ఆయుధ పూజ నిర్వహించారు. పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ ఆయుధ, వాహన పూజ జరిపారు. దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శక్తికి ప్రతీకగా నిలిచే దుర్గామాత సమక్షంలో ప్రతి ఆయుధానికి ఎంతో శక్తి ఉంటుందన్నారు. పోలీస్ శాఖలో ప్రతి స్థాయి అధికారి ప్రజా రక్షణలో ముందుంటూ ప్రజల మన్ననలు పొందాలన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి విజయదశమి చిహ్నమని, సమాజంలో చెడును పారదోలేందుకు పోలీస్‌శాఖ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్, అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సీ రాజు, గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, సుందర్‌రావు, ఆర్ఐలు దామోదర్, మల్లేషం, వాహనమూర్తి, సంపత్, శ్రీనివాస్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు పోచలింగం పాల్గొన్నారు.

గోదావరిఖని వన్‌టౌన్‌లో ఆయుధ పూజ

గోదావరిఖని వన్‌టౌన్‌లో విజయదశమి సందర్భంగా ఆయుధ పూజ నిర్వహించారు. గోదావరిఖని ఏసీపీ మడక రమేష్, సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐలు కే రమేష్, శ్రీనివాస్, భూమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 13: రామగుండం కార్పొరేషన్ 6వ డివిజన్‌లో అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని శనివారం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ ప్రజల సమస్యలు పరిష్కరించడానికి కార్యాలయం ఉపయోగపడుతుందని, ప్రజలకు సేవలు అందించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, కార్పొరేటర్ మహంకాళి స్వామి పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుల ఘర్షణ

కోల్‌సిటీ, అక్టోబరు 13: ప్రజలు ఆనందంతో దసరా ఉత్సవాల్లో జరుపుకుంటుంటే కొందరు యువకులు చిత్తుగా మద్య సేవించి శనివారం గోదావరిఖని సింగరేణి స్టేడియంలో గొడవకు దిగారు. మద్యం సేవించి వచ్చిన గాంధీనగర్, లెనిన్‌నగర్‌కు చెందిన యువకులు చిన్న ఘటనలతో రెచ్చిపోయి కొట్టుకున్నారు. సింగరేణి స్టేడియంలోని స్విమ్మింగ్‌పూల్ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు ఉత్సవాల బందోబస్తులో ఉండగా వెనుకవైపు యువకులు గొడవ పడ్డారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. పోలీసులు గాంధీనగర్, లెనిన్ నగర్‌కు చెందిన రోషన్, కిషన్, చోటు, బన్ని, పాండు, అభిలాల్, చిన్నా, అనీల్, వెంకటేష్‌పై కేసు నమోదు చేశారు.

గోదావరిఖనిలో యువకుడికి కత్తిపోట్లు

కోల్‌సిటీ, అక్టోబరు 13: గోదావరిఖని మార్కండేయకాలనీ శ్రీకృష్ణ మందిర్ సమీపంలో శనివారం రాత్రి జంగ రణధీర్‌రెడ్డి అనే యువకుడిపై నలుగురు కత్తులతో దాడి చేశారు. ఈ ఘటనలో అతని భుజానికి గాయాలయ్యాయి. రణధీర్‌రెడ్డి దసరా ఉత్సవాలకు హాజరై ఇంటికి వెళుతుండగా గాంధీనగర్‌కు చెందిన అరవింద్, నాగిరెడ్డి, నిఖిత్‌రెడ్డి, కొమ్ము శ్రీనివాస్ అనే వ్యక్తులు పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని దాడి చేశారని, వారించేందుకు వచ్చిన బాధితుడు సోదరుడు సంజయ్‌రెడ్డి, అతని స్నేహితుడు వెంకట్‌పై కూడా దాడి చేశారన్నారు. నిఖిత్‌రెడ్డి, అరవింద్‌లు పాత నేరస్థులు. గతంలో ఒక కత్తిపోట్ల ఘటనలో కూడా వీరు నిందితులు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్జీ-3లో ఘనంగా రామ్‌లీలా



రాణిరుద్రమాదేవి క్రీడాప్రాంగణంలో ఏర్పాటు చేసిన రావణుడి ప్రతిమ

రామగిరి, అక్టోబరు 13: సింగరేణి ఆర్జీ-3 డివిజన్ సెంటినరీకాలనీ రాణిరుద్రమాదేవి క్రీడాప్రాంగణంలో శనివారం రాత్రి ఘనంగా రామ్‌లీలా కార్యక్రమాన్ని నిర్వహించారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైవిరావు, ఎంఆర్‌సీరెడ్డి, జూపాక రాంచందర్, కొటరవీందర్‌రెడ్డి, కార్మికులు, కుటుంబాలు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

విషాదాంతమైన వివాహిత ప్రేమ వ్యవహారం

- రెండు రోజుల క్రితం యువకుడి హత్య - ఆత్మహత్యకు పాల్పడిన మహిళ

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 13: మహిళ ప్రేమ వ్యవహారం విషాదాంతమైంది. రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. వివాహితను ప్రేమించిన యువకుడు రెండు రోజుల క్రితం హత్యకు గురికాగా... సదరు వివాహిత సైతం ఆదివారం ఆత్మహత్య చేసుకున్నది. గోదావరిఖని బాపూజీనగర్‌కు చెందిన అంజలికి సింగరేణి ఏరియా హాస్పిటల్‌లో స్కావెంజర్‌గా పనిచేస్తున్న వడ్డాది వినయ్‌కుమార్‌తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. అప్పటికే పెళ్లి అయి భర్త ఇద్దరు సంతానం ఉన్న అంజలిని వినయ్‌కుమార్ రెండు నెలల క్రితం గుడిలో పెళ్లి చేసుకున్నాడు. పెళ్లికి ఇరుకుటుంబాలు అంగీకరించకపోవడంతో కాలనీలోని హనుమాన్‌నగర్‌లో నివసిస్తున్నారు. ఈక్రమంలో ఈనెల 10న అంజలి భర్త, సోదరుడు కాలనీలోని వినయ్‌కుమార్ ఇంటికి వచ్చి కత్తులతో దాడి చేసి హత్య చేశారు. వినయ్ కుటుంబ సభ్యులు అంజలితో పాటు వారి కుటుంబ సభ్యులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన తర్వాత ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా నల్లజర్లలో బంధువుల ఇంట్లో ఉంటున్న అంజలి ఆదివారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

ధర్మపురిలో వైభవంగా దసరా ఉత్సవాలు


శమీ వృక్షం వద్ద పూజలో పాల్గొన్న ప్రభుత్వ విప్, అధికారులు


గాలిలోకి కాల్పులు జరుపుతున్న ధర్మపురి సీఐ, ఎస్ఐ

ధర్మపురి, అక్టోబరు 13: ధర్మపురి క్షేత్రంలో దసరా ఉత్సవాలు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయంత్రం లక్ష్మీనృసింహస్వామి, వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను ఆలయం నుంచి చింతామణి చెరువు గట్టు మీదుగా క్షేత్ర సమీపంలో గల నూతన జమ్మిగద్దె వరకు ఊరేగింపు జరిపారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య శమీ వృక్ష పూజలు నిర్వహించారు. పోలీస్ శాఖ పక్షాన ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ గంగుల మహేష్ గౌరవ వందనంగా తుపాకితో రెండుసార్లు గాలిలోకి కాల్పులు జరిపారు. అనంతరం స్వామి వారల సేవలను అక్కడి నుంచి కమలాపూర్ చౌరస్తా, బస్ స్టేషన్, బ్రాహ్మణ వీధి మీదుగా ఇసుక స్తంభం వరకు ఊరేగింపు జరిపారు. ఇసుక స్తంభం వద్ద గల మండపంలో ప్రత్యేక పూజలు అనంతరం స్వామి వారల సేవలను తిరిగి ఆలయానికి తీసుకువచ్చారు. ఆలయం పక్షాన స్థానిక బస్‌స్టేషన్ ఆవరణలో ఈవో సంకటాల శ్రీనివాస్ రావణ దహనం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని రాత్రి వరకు తిలకిం చారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, టీపీసీసీ సభ్యుడు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కు. రవీందర్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సింహరాజు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● శమీ పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ అడ్లూరి

ధర్మపురి క్షేత్ర సమీపంలో గల జంబి గద్దె వద్ద నిర్వహించిన శమీ వృక్ష పూజల్లో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతం శమీ వృక్ష పూజకు బయలు దేరిన స్వామివారల సేవను ఆయన మోసి భక్తిప్రపత్తులు చాటుకున్నారు.

● వేములవాడలో రాజరాజేశ్వరీదేవిగా అమ్మవారు

వేములవాడ కల్చరల్: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. విజయదశమి పర్వదినాన్ని పురష్కరించుకొని శనివారం రాజరాజేశ్వరీ దేవి అమ్మవారు మహాలక్ష్మి (పాలవెల్లి) రాజరాజేశ్వరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. పార్వతిపరమేశ్వరులు, లక్ష్మీసమేతపద్మనాభస్వామి ఉత్సవమూర్తులకు అంబారీ సేవపై పూజలు నిర్వహించారు. అనంతరం పెద్ద సేవతో పట్టణ పురవీధుల్లో శమియాత్ర నిర్వహించారు. మహాలక్ష్మీ వీధిలోని జమ్మిచెట్టు వరకు ఊరేగింపు నేత్రపర్వంగా కొనసాగింది. శమియాత్రలో భాగంగా పెద్ద సేవలో పాల్గొనేందుకు హాజరైన భక్తులు పెద్ద సంఖ్యలో పార్వతీపరమేశ్వరులను దర్శించుకున్నారు. ముందుగా ఆలయంలోని లక్ష్మీపద్మనాభ ఆలయ ప్రాంగణంలో ఆయుధాలను ఒక్కచోట పేర్చి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయుధ పూజ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముందుగా రాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకుని ఆయుధ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.


వేములవాడలో అంబారీ సేవపై ఊరేగుతున్న ఉత్సవమూర్తులు


రాజన్న ఆలయంలో ఆయుధ పూజలో పాల్గొన్న ఆది శ్రీనివాస్

అదుపు తప్పిన కారు

- రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్‌కు ఢీ


రోడ్డు కిందకు దూసుకెళ్లిన కారు

సుల్తానాబాద్, అక్టోబరు 13: సుల్తానాబాద్ మండలంలోని సుగ్లాంపల్లి వద్ద కారు వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కనునన్న కల్వర్ట్‌లో పడి పోయింది. అక్కడే ఉన్న 15 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గోదావరిఖని ఎన్టీపీసీకి చెందిన పోతు అశోక్ అనే వ్యక్తి ఆదివారం ఉదయం తన కుటుంబసభ్యులను కారులో కరీంనగర్‌లో దింపి తిరిగి మధ్యాహ్నం ఎన్టీపీసీ వస్తున్నాడు. ఈ క్రమంలో సుగ్లాంపల్లి వద్ద కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. షార్ట్ సర్క్యూట్ జరగకపోవడంతో ప్రమాదం తప్పింది. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

రేణికుంట టోల్ గేట్ వద్ద వాహనాల రద్దీ

- కిలోమీటర్ మేర నిలిచిన వాహనాలు - హైదారాబాద్ వైపు వెళ్లే వాహనాదారులకు ఇబ్బందులు

తిమ్మాపూర్, అక్టోబరు 13: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట గ్రామం వద్ద రాజీవ్ రాహదారిపై ఉన్న టోల్‌గేట్ వద్ద ఆదివారం కిలోమేటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో కరీంనగర్ నుంచి హైదారాబాద్ వైపు వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడ్డారు. దసరా పండగ సందర్భంగా హైదారాబాద్ నుంచి తమ స్వగ్రామాలకు వచ్చిన వారు తిరిగి ఆదివారం హైదారాబాద్‌కు పయనమయ్యారు.

కరీంనగర్ నుంచి హైదారాబాద్ వైపునకు వెళ్లే వారు ఎక్కువ ఉండడంతో వందల సంఖ్యలో వివిధ రకాల వాహనాలు రేణికుంట టోల్ గేట్ వద్ద బారులు తీరాయి. కిలోమీటర్ వరకు వాహనాలు బారులు తీరడంతో వాహనాదారులు ఇబ్బందిపడ్డారు. చివరికి సిబ్బంది టోల్ డబ్బులు తీసుకోకుండానే లైన్‌లో వచ్చినవి వచ్చినట్లు పంపించారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది.


టోల్ ప్లాజా వద్ద బారులుదీరిన వాహనాలు

దసరా వేడుకల్లో అపశ్రుతి

- విద్యుదాఘాతంతో యువకుడి మృతి
- గ్రామంలో నిలిచిన వేడుకలు

భీమారం, అక్టోబరు 13: జగిత్యాల జిల్లా భీమారం మండలంలోని రాగోజీపేట గ్రామంలో దసరా వేడుకల్లో శనివారం అపశ్రుతి చోటు చేసుకుంది. గ్రామంలో దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని మహిషాసుర మర్దన కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలోనే మహిషాసురుడికి నిప్పు పెట్టే ప్రయత్నంలో విద్యుత్ తీగను గ్రామానికి చెందిన అరిసెల వెంకటేష్ (35) సరి చేసే క్రమంలో అక్కడే ఉన్న ట్రాన్స్‌పార్మర్‌కు వైరు తగిలింది. దీంతో


వెంకటేష్ (ఫైల్)

విద్యుదాఘాతానికి గురై కుప్పకూలాడు. గమనించిన స్థానికులు వెంటనే జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెంకటేష్ మృతితో గ్రామంలో దసరా ఉత్సవాలు ఆగిపోయాయి. మృతుడికి భార్య, కూతురు ఆద్య(10), కొడుకు ఆర్యన్(6) ఉన్నారు. మృతుడు వెంకటేష్ భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై శ్యాంరాజ్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'నిత్యాన్నదానం' సరుకులు చోరీ

● కొండగట్టు అంజన్న సన్నిధిలో ఘటన
● సదరు అధికారికి మెమో జారీ

మల్యాల, అక్టోబరు 13: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థనం పరిధిలో నిర్వహిస్తున్న నిత్యాన్నపథకంకు వినియోగించే సరుకులు చోరీకి గురైనట్లు వచ్చిన ఫిర్యాదులపై అధికారులు సంబంధిత అధికారికి మెమో జారీ చేశారు. కొండగట్టులో నిర్వహిస్తున్న నిత్యాన్నదానం పథకంలో భాగంగా అన్నదానానికి వినియోగించే సరుకులను ఈ నెల 9న ఆటోలో తరలించిన్నట్లు పలువురు దేవస్థానం అధికారులక ఫిర్యాదు చేశారు. దీంతో సీసీ కెమెరాలను అధికారులు పరిశీలించినట్లు తెలిసింది. ఈవో రామకృష్ణరావు ఆదేశాల మేరకు ఆదివారం ఏఈవో అంజయ్య అన్నదానం ఇన్‌చార్జి రాములుకు మెమో జారీ చేశారు. 24 గంటల్లోపు సంజాయిషీ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. సదరు అన్నదానం ఇన్‌చార్జి గతంలో పని చేసిన చోట ఇలాంటి ఆరోపణలు ఉన్నట్లు చర్చించుకుంటున్నారు. అయితే అన్నదానం సరుకుల అక్రమ తరలింపుపై అధికారులు విచారణ జరిపి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎస్సారెస్పీ కాలువలో మృతదేహం గుర్తింపు

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు 13: మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రామానికి చెందిన సుంకేట కొండస్వామి(46)అను వ్యక్తి మృతదేహం ఎస్సారెస్పీ కాలువలో ఆదివారం గుర్తించారు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల 10న ఇంట్లో ఎవరికి తెలపకుండా వెళ్లిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమం లో మేడిపల్లి మండలంలోని కట్లకుంట గ్రామసమీపంలోని ఎస్సారెస్పీ కాలువ లో సుంకేట కొండస్వామి మృతదేహం కనిపించగా కుటుంబ సభ్యులకు తెలి పారు. మెట్‌పల్లి వెళ్లి తిరిగి మెట్లచిట్టాపూర్‌కు వస్తున్న క్రమంలో వెల్లుల్ల గ్రామశివారులోని ఎస్సారెస్పీ కాలువ సమీపంలో బహిర్భుమికి వెళ్లి ప్రమాదవ శాత్తు అందులో పడి మృతి చెంది ఉంటాడని కుటుంబసభ్యులు, పోలీసులు భావిస్తున్నారు. మృతుడి కొడుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితో దాడి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

● దసరా వేడుకల్లో ఘర్షణ

మల్యాల, అక్టోబరు 13: దసరా వేడుకల సందర్భంగా మండలంలోని ఓగులాపూర్‌లో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ కత్తులతో దాడికి దారి తీయగా ఈ ఘటనలో ఇద్దరు గ్రామస్థులు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో దసరా వేడుకల్లో భాగంగా శనివారం గ్రామస్థులు శమి పూజకు వెలుతున్న క్రమంలో గ్రామానికి చెందిన రెండు వర్గాల మధ్య ఘర్షణ నెలకొని వాగ్వాదం జరిగింది. రాత్రి వేళల్లో మళ్లీ ఇరువర్గాలు గొడవ పడగా ఒక వర్గానికి చెందిన ఏడుగురు వ్యక్తులు కత్తితో దాడి చేయడంతో మేరుగు మనోహర్ అనే యువకుడు కత్తిపోట్లకు గురయ్యాడు. ఇదే గొడవలో మండల మహేశ్ అనే వ్యక్తి తన కొడుకు దినేశ్ కోసం వెళ్లగా వారిపై కూడా దాడి చేయడంతో మహేశ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఇద్దరిని చికిత్స కోసం జగిత్యాల తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు. బాధితుడు మేరుగు మనోహర్ ఫిర్యాదు మేరకు దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

అలాగే మల్యాలలోని ఒర్రెగడ్డ వైన్స్ వద్ద దసరా సందర్భంగా యువకులు పరస్పరం దాడులకు పాల్పడ్డా రు. వందలాది యువకులు పోగు అయి రహదారిపైనే దాడులకు పాల్పడడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో స్వల్ప ఘర్షణలు చోటుచేసుకోగా పోలీసులు పర్యవేక్షించారు.

జగిత్యాలలో ఒకరిపై దాడి

జగిత్యాల క్రైం, అక్టోబరు 13: జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఉన్న ఓ హోటల్‌లో కస్టమర్‌పై నిర్వాహకులు దాడి చేసిన ఘటన శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన కిషన్ అనే వ్యక్తి జగిత్యాలలోని ఓ హోటల్‌లో టిఫిన్ చేసేందుకు వెళ్లాడు. టిఫిన్ విషయంలో నిర్వాహకులతో వాగ్వాదం జరగడంతో కిషన్‌పై దాడి చేశారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

తండ్రి వర్ధంతికి వస్తూ.. కానరాని లోకాలకు..

- అదుపుతప్పి కారు బోల్తా.. యువకుడి మృతి

ఓదెల, అక్టోబరు 13: కన్నతండ్రి వర్ధంతి కార్యక్రమానికి హాజరుకావాలనే ఆతృత కొడుకు నిండు ప్రాణాలను బలితీసుకుంది. కారులో అర్ధరాత్రి అతివేగంగా ప్రయాణిస్తున్న క్రమంలో ఘోరరోడ్డు ప్రమాదానికి గురై తీవ్రగాయాలతో యువకుడు మృతిచెందిన ఘటన జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం వడ్డిచర్లలో జరిగింది. వివరాల్లోకెళితే.. పెద్దపెల్లి జిల్లా ఓదెల మండలం మడక గ్రామానికి చెందిన నోముల రవీందర్‌రెడ్డి(32) అనే యువకుడు నల్లగొండ జిల్లా కేంద్రంలో వండర్‌వరల్డ్ పేరిట ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో నల్లగొండ నుంచి స్వగ్రామం మడకలో తన తండ్రి రాంచంద్రారెడ్డి రెండో వర్ధంతి కార్యక్రమం ఆదివారం జరగనుండగా అక్కడికి సకాలంలో చేరుకునేందుకు తెల్లవారుజామున కారులో బయలుదేరాడు. ఈ క్రమంలో వడ్డిచర్ల శివారుకు చేరుకునే వరకు అతివేగానికి నిద్రమత్తు తోడై కారు అదుపు తప్పి రోడ్డుపక్కకు బొల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన రవీందర్‌రెడ్డిని స్థానికులు 108 ద్వారా జనగామ ఆసుపత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యలో మృతిచెందాడు. కాగా లింగాలఘణపురం ఎస్సై శ్రవణ్‌కుమార్ కేసునమోదు


ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు, ఇన్‌సెట్‌లో రవీందర్‌రెడ్డి(ఫైల్)

చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు. అయితే మృతుడికి తల్లి శ్రీలత, సోదరులు కిషన్‌రెడ్డి, రాజిరెడ్డిలు ఉండగా రాజిరెడ్డి వారం రోజుల క్రితమే ఉన్నత చదువుల నిమిత్తం లండన్‌కు వెళ్లడం గమనార్హం.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

శంకరపట్నం, అక్టోబరు 13: దసరా పండుగకు పెద్దమ్మ ఇంటికి వెళ్లి వస్తానని చెప్పిన ఓ యువకుడు శనివారం శంకరపట్నం మండలం తాడికల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. పోలీసుల కథనం ప్రకారం..చిగురుమామిడి మండలం లంబాడిపల్లెకు చెందిన బండారిపల్లి వినయ్ (25) కరీంనగర్‌లో నివాసం ఉంటున్నాడు. శనివారం దసరా పండుగకు తాడికల్‌లోని పెద్దమ్మ ఇంటికి వెళ్లి వస్తానని తండ్రి రామస్వామికి చెప్పాడు. వినయ్ కరీంనగర్ నుంచి బైక్‌పై వస్తుండగా, తాడికల్ శివారులోని శివాలయం సమీపంలోని మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టింది. దీంతో వినయ్ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. పండుగ పూట వినయ్ మృతితో కుటుంబసభ్యులు, బంధువులు రోదనలు మిన్నంటాయి. మృతుడు వినయ్ తండ్రి రామస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

భార్యను హత్య చేసిన భర్త


మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

వీర్నపల్లి, అక్టోబరు 13: మండలంలోని జవహర్లాల్ నాయక్ తండాలో భార్య గొంతుకు తాడు బిగించి భర్త హత్య చేశాడు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. జవహర్లాల్ నాయక్ తండాకు చెందిన గుగులోతు సుశీల (40)ను భర్త గుగులోతు రవి హత్య చేసి పరారయ్యాడు. రవి కొంతకాలంగా మద్యం తాగుతూ భార్య సుశీలతో గొడవ పడుతుండేవాడు. శనివారం దసరా పండగ రోజు ఆమె పిల్లలు లాల్ సింగ్ తండాలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లారు. రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న భార్యను తాడుతో గొంతుకు బిగించి హత్య చేసి ఇంటి ముందర మంచంపై పడుకోబెట్టి పరారయ్యాడు. ఆదివారం ఉదయం ఇంటికి చేరుకున్న కుమారుడు సాయిచరణ్, కూతురు షర్మిల ఇంటి ఎదుట మంచంపై విగత జీవిగా పడి ఉన్న తల్లిని చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న సుశీల కుటుంబసభ్యులు భర్త రవి హత్య చేసి పారిపోయాడంటూ పోలీసులకు తెలిపారు. సుశీల హత్యతో తండాలో విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐ శ్రీనివాస్ గౌడ్ ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, ఇంటి తాళాన్ని పగలగొట్టి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో పరిశీలించారు. ఇంట్లో తాడు ఉండడంతో భర్తనే తాడుతో హత్య చేసినట్లు నిర్ధారించుకొని పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు.

నిందితుడు గుగులోతు రవిపై గతంలో పలు కేసులు నమోదయ్యాయి. ఇటీవల బ్లూ కోల్ట్స్ సిబ్బందిపై దాడి చేశాడు. మృతురాలి అన్న భూక్య లోక్‌నాయక్ ఫిర్యాదుతో గుగులోతు రవిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై ఎల్లాగౌడ్ తెలిపారు. ఎల్లారెడ్డిపేట ఎస్సై రమాకాంత్, గంభీరావుపేట ఎస్సై శివకుమార్, శిక్షణ ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుడి కోసం గాలింపు చేపట్టారు

అప్పుల వేధింపులతో ఒకరి ఆత్మహత్య


సాయికృష్ణ (ఫైల్)

తంగళ్లపల్లి, అక్టోబరు 13: అప్పు చెల్లించాలనే వేధింపులు భరించలేక తంగళ్లపల్లి మండలం మండెపల్లి కేసీఆర్ నగర్‌కు చెందిన దుబాసి సాయికృష్ణ (27) ఉరేసుకొని శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. కేసీఆర్ నగర్‌కు సాయికృష్ణ అదే కాలనీకి చెందిన నూతి అనిల్ వద్ద రూ.20 వేలు అప్పు చేశాడు. రెండు రోజుల క్రితం అప్పు చెల్లించాలని వేధింపులకు గురిచేసి సాయికృష్ణ ఫోన్‌ను బలవంతంగా లాక్కెళ్లాడు. అవమానంగా భావించి తీవ్ర మనస్తాపానికి గురై శనివారం దసరా పండుగ రోజు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. సాయికృష్ణకు భార్య ఉదయశ్రీ, కుమారుడు ఉన్నారు. నూతి అనిల్ వేధింపులతోనే తన కుమారు డు సాయికృష్ణ ఆత్మహత్య చేసుకున్నాడని తల్లి దుబాసి విజయ పోలీసుల కు ఫిర్యాదు చేసింది. అనిల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాంమోహన్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 13: మండల కేంద్రంలో అద్దెకు ఉంటూ స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రిలో డయాలసిస్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న కొప్పూరి మాధవ (27) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై రమాకాంత్ శనివారం తెలిపారు. మృతుడి స్వగ్రామం నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ గ్రామమని పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌కు చెందిన కొప్పూరి మాధవ మూడేళ్ల కిందట ఎల్లారెడ్డిపేటకు వచ్చి ఓ గదిని అద్దెకు తీసుకుని జీవిస్తున్నాడు. స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రిలో డయాలసిస్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. అదే ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న మరో నలుగురు యువకులతో కలిసి గదిలో ఉంటుండేవాడు.

ఈ నెల 11న ముగ్గురు ఆసుపత్రికి వెళ్లారు. రాత్రి మాధవ ఒక్కడే తలుపునకు గడియ వేసుకుని ఉన్నాడు. అదే రోజు రాత్రి 11.30 గంటలకు విధులు ముగించుకున్న యువకుడు అభిలాష్ గదిని చేరుకుని తలుపు తట్టాడు. ఎంత పిలిచినా మాధవ తలుపులు తీయకపోవడంతో తిరిగి అభిలాష్ ఆసుపత్రికి వెళ్లి నిద్రకు ఉపక్రమించాడు. ఈ నెల 12న అనుమానం వచ్చిన గది యజమాని తలుపులు పగులకొట్టి చూసే సరికి మాధవ మృతి చెంది కనిపించడంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు సోదరుడు శేషాద్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

● మానకొండూర్ మండలం వెల్దిలో..


త్రినాథ్(ఫైల్)

మానకొండూర్: మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన ఇల్లందుల త్రినాథ్ (21) అనే యువకుడు అనుమానాస్పదస్థితిలో వ్యవసాయబావిలో పడి మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్ది గ్రామానికి చెందిన ఇల్లందుల బాగ్యమ్మ-నాంపెల్లి దంపతులకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు త్రినాథ్ ఉన్నారు. పదో తరగతి చదివిన త్రినాథ్ ఆటో నడుపుతూ తండ్రికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. శనివారం త్రీనాథ్ తన మిత్రులు రుద్రారం తిలక్, కొమ్మగల్ల కిరణ్, రామగిరి సందీప్ కలిసి ఆటో(ఏపీ15టీసీ1433)లో మండలంలోని రంగపేట గ్రామ శివారులోకి వెళ్లారు. రాత్రి వరకు అక్కడే ఉన్నారు. అనంతరం త్రీనాథ్ వ్యవసాయబావిలో పడి మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు త్రీనాథ్ బావి వద్దకు చేరుకొని స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ లక్ష్మీనారాయణ పరిశీలించారు. బావిలో నీరు ఎక్కువగా ఉండడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. రాత్రి నుంచి తెల్లవారే సరికి బావిలోని నీరు తోడివేశారు. ఆదివారం బావిలో నుంచి మృతదేహాన్ని బయటికి తీశారు. పండుగ పూట ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రైలు కిందపడి మేషన్ కార్మికుడి ఆత్మహత్య

ఓదెల, అక్టోబరు 13: మండలంలోని పొత్కపల్లి 29వ, రైల్వే గేట్ సమీపంలో ఆదివారం ఇదే మండలం జీలకుంటకు చెందిన రెడ్డి ఆదిత్య (30) అనే మేషన్ కార్మికుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యాదవ సంఘం కమ్యూనిటీ భవన్ సమీపంలో గల అప్ రైల్వే లైన్ పట్టాల మధ్యన పడుకొని తలను లైన్ పైన పెట్టిన వెంటనే అదే లైన్‌లో వస్తున్న రైలు డ్రైవర్ హారన్ కొట్టిన కూడా పక్కకు జరగకపోవడంతో రైల్ చక్రాల కింద తల నుజ్జునుజ్జయింది.

ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఇప్పటివరకు జీ.ఆర్.పి పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు, కూతురు ఉన్నారు. శనివారం వరకు పండుగల వేడుకల్లో కుటుంబంతో, మిత్రులతో గడిపిన ఆదిత్య మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.



కుల గణనకు గ్రీన్ సిగ్నల్

రెండు మాసాల్లో పూర్తి చేయాలని ఆదేశాలు

బీసీలతో పాటు ఎస్సీ, ఎస్టీల కులగణన

జనవరిలో స్థానిక ఎన్నికలకు లైన్ క్లియర్

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రాష్ట్రంలో బీసీలతో పాటు ఎస్సీ, ఎస్టీ కులగణన సర్వే చేపట్టేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో స్థానిక సంస్థల ఎన్నికలకు లైన్ క్లియర్ అయ్యింది. దీంతో స్థానిక సంస్థల్లో పోటీ చేయాలని భావిస్తున్న ఆశావహులు ఇప్పటి నుంచే ఎన్నికలకు సన్నద్ధం అవుతున్నారు. దసరా పండుగ ఒక్కరోజు ముందే ప్రభుత్వం కులగణన సర్వేకు సంబంధించి జీవో నంబర్ 18 విడుదల చేయడంతో ఆశావహుల్లో ఆనందం వ్యక్తమవుతున్నది.

దసరా పండుగ రోజున తమ ప్రాభవాన్ని చాటుకునేందుకు గ్రామాల్లో పెద్ద ఎత్తున తమ ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అందరి దృష్టిని ఆకర్షించే విధంగా దసరా ఉత్సవాల్లో పాల్గొన్నారు. అంతేగాకుండా తమ అనుచర గణానికి దావత్‌లు ఇవ్వడంతో పాటు ఎన్నికలకు సన్నద్ధం చేస్తున్నారు.

బీసీ కులగణన చేయనిదే గ్రామ పంచాయతీ ఎన్నికలను గానీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలను గానీ నిర్వహించవద్దని ప్రతిపక్ష బీఆర్ఎస్, భారతీయ జనతా పార్టీలతో పాటు బీసీ సంఘాలు సైతం పట్టుబట్టాయి. అంతేకాకుండా ఈ విషయమై బీసీ సంఘం నాయకులు హైకోర్టును సైతం ఆశ్రయించారు. హైకోర్టు కూడా బీసీ కులగణన చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని ఆదేశించింది. కోర్టు సూచనల మేరకు ప్రభుత్వం కూడా కుల గణన పూర్తయిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని భావించింది. బీసీ కుల గణనపై రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 4వ తేదీన జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో తీర్మానాన్ని కూడా ప్రవేశపెట్టింది. అయితే బీసీ కుల గణనపై ఆయా రాష్ట్రాల్లో అధ్యయనం చేసేందుకు ప్రభుత్వ అధికారులను పంపించింది. అధ్యయనం చేసిన వివరాలను ప్రభుత్వానికి అప్పగించడంతో కుల గణనకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

ప్రణాళిక శాఖకు బాధ్యత అప్పగింత..

కుల గణన బాధ్యతను ప్రణాళిక శాఖకు అప్పగించింది. కుల గణన పూర్తయ్యే వరకు ప్రణాళికా శాఖ నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనున్నది. బీసీ కుల గణనతో పాటు ఎస్సీ, ఎస్టీల, ఇతర వెనుకబడిన వర్గాల కులాల సర్వేని కూడా చేపట్టాలని ప్రభుత్వం జీవోలో పేర్కొంది. సామాజిక, ఆర్థిక పరమైన స్థితిగతులే కాకుండా విద్య, ఉద్యోగ, రాజకీయ అంశాల్లోనూ సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశించిం ది. ఈ సర్వేను 60 రోజుల్లో పూర్తిచేయాలని ఆ జీవో లో పేర్కొంది. అయితే సర్వేకు సంబంధించిన మార్గదర్శకాలు ఇంకా విడుదల కాలేదు.

ఈ సర్వేకు ప్రణాళిక సంఘం నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పంచాయతీ రాజ్ శాఖ, రెవెన్యూ శాఖల అధికార యంత్రాంగాన్ని, సిబ్బందిని వినియోగించుకోవలసి ఉంటుంది. ఒకటి, రెండు రోజుల్లో దీనికి సంబంధించిన పూర్తి మార్గదర్శకాలు వెలువడే అవకాశాలు ఉన్నాయని జిల్లా ప్రణాళిక సంఘం అధికారి గంప రవీందర్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. గ్రామ పంచాయతీ పాలక వర్గాల పదవీ కాలం ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేదీన పూర్తయింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల జోలికి వెళ్లలేదు. ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామపంచాయతీలు కొనసాగుతున్నాయి. బీసీ కుల గణన అడ్డంకిగా మారడంతో ఇప్పటివరకు ఎన్నికలు నిర్వహించలేదు. కానీ ఎన్నికల నిర్వహణకు అన్ని రకాలుగా ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే అసెంబ్లీ ఓటర్ల జాబితాలను అనుసరించి గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా గతనెల 29వ తేదీ నాటికి తుది జాబితాలను సిద్ధం చేసింది.

ఈ ఎన్నికల్లో ఓటర్ జాబితాలను తయారు చేయడం ప్రధానం కావడంతో ఆ ప్రక్రియను పూర్తి చేశారు. కుల గణన సర్వే పూర్తికాగానే వాటి ఆధారంగా స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లను ఖరారు చేసిన అనంతరం ఎన్నికలను నిర్వహించనున్నారు. ఈ సర్వే ప్రక్రియ డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తికా నున్నది. అప్పటివరకు ప్రభుత్వానికి ఆయా కులాల స్థితిగతులపై ఒక అవగాహన రానున్నది. ముందు గా స్థానిక సంస్థల ఎన్నికలకు రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు. మొత్తం కుల గణన సర్వేకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఈ సర్వే ఎప్పుడు చేపడుతారా అని ఎదురు చూస్తున్న వివిధ రాజకీయ పార్టీల నాయకులకు, వివిధ వర్గాల ప్రజలకు ఊరట లభించింది.

ఘనంగా దుర్గా మాత నిమజ్జనోత్సవం






చీకురాయిలో దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్యే విజయరమణారావు, బొంపల్లి గ్రామంలో ఊరేగింపు, కొదురుపాకలో దుర్గామాత నిమజ్జన యాత్ర, పూసాలలో దుర్గామాత నిమజ్జన యాత్ర

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 13 : పెద్దపల్లి మండలంలోని వివిధ గ్రామాలలో ఆదివారం దుర్గమాత నిమజ్జోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు యువకులు భవాని దీక్షను భూనీ పవిత్రంగా పూజలు నిర్వహించారు. అలాగే భక్తులంతా దంపతుల వారిగా పవిత్ర స్నానాలను ఆచరించి నవరాత్రులు, నవ అవతారాల్లో దర్శనమిచ్చిన దుర్గ మాత వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఈసారి గ్రామ గ్రామాన దుర్గ మాత విగ్రహాలను ప్రతిష్ఠించి యువకులు, యువతూలు భక్తిని చాటారు. నవరాత్రులు ముగింపు సందర్భంగా గ్రామాలలో దుర్గ మాత రథాలతో ఊరేగింపు నిర్వహించారు. చిన్న పెద్ద తేడా లేకుండా ఊరేగింపుల్లో భక్తి పారవశ్యంగా గేయాలను ఆలపిస్తూ దాండియా ,కోలాటం ఆటలతో నిమజ్జ నోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం సమీపంలోని చెరువులు, కుంటల్లో దుర్గ మాతను నిమజ్జనం చేశారు. మండలంలోని చీకురాయి గ్రామంలో రామ్‌సేన యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు హజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక అర్చనలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం రామ్‌సేన యూత్ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : శరన్నవరాత్రుల్లో భాగంగా సుల్తానాబాద్ పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాలను ఆదివారం నిమజ్జనం చేశారు. సుల్తానాబాద్ పట్టణంలోని వైశ్యా భవన్‌తో పాటు వేణుగోపాలస్వామి ఆలయంలో, పాత జెండా వద్ద, గాంధీ నగర్, జవహర్ నగర్ తదితర ప్రాంతాలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాలను భక్త సమూహంతో పాటు మంగళవాయిద్యాల నడుమ సుల్తానాబాద్ చెరువులో నిమజ్జనం చేశారు. అలాగే మండలంలోని కనుకుల అభయాంజనేయ స్వామి, శివాలయంలో, రేగడిమద్దికుంట తదితర గ్రామాలలో కూడా నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి.

ఓదెల : మండలం కేంద్రంతో పాటు కనగర్తి, కొలనూర్, జీలకుంట, పొత్కపల్లి, గుంపుల, కొమిర, మడక తదితర గ్రామాల్లో ఆదివారం దుర్గమాత నిమజ్జనోత్సవం భక్తిపార్యవశ్యంగా నిర్వహించారు. నవరాత్రులు పవిత్రంగా భక్తులంతా పూజలు నిర్వహించి తొమ్మిది అవతరాల దుర్గ మాతను దర్శించుకున్నారు. ఇన్నాళ్లుగా దుర్గ మాత మండపాల వద్ద కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా గ్రామాల్లో దుర్గ మాత రథాలతో శోభాయాత్రలను ఉత్సాహంగా, ఉల్లాసంగా నిర్వహించారు. చిన్నారులు, మహిళలు దాండియా కళా ప్రదర్శనలతో దుర్గ భవాని విగ్రహాలను తరలించి చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.

ఎలిగేడు : మండల కేంద్రంలోని పలు గ్రామాల్లో ప్రతిష్ఠించిన శ్రీదుర్గా దేవి నిమజ్జనం ఏర్పాట్లు పూర్తయ్యాయి.సాయంత్రం నుండి రాత్రి వరకు దుర్గాదేవి నిమజ్జనం చేశారు. ఈ మేరకు నవరాత్రులు పూర్తిచేసుకొని దుర్గామాత గంగమ్మ ఒల్లోకి చేరింది. భక్తులు నిమజ్జనం ఏర్పాట్లులో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాలకుర్తి : మండలం పరిధిలోని పలు గ్రామాల్లో శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భవాని భక్తులు బోనాలతో దుర్గమ్మను వైభవంగా ఊరేగించారు.అయా గ్రామాల గ్రామస్తులు అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా తయారు చేసిన వాహనాల్లో ఊరేగించి సమీపంలోని గోదావరి నదిలో నిమజ్జనం చేశారు.

కమాన్‌పూర్ : దసరా నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహాల ఊరేగింపు ఆదివారం కన్నుల పండువగా జరిగింది. అంతకుముందు దుర్గామాత విగ్రహాలకు నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళల కోలాటలు, భజనలు, యువత ఆనందోత్సవాల మధ్య టపాసుల మోతతో ఊరేగింపుగా గ్రామ శివారులలోని చెరువులకు తరలించారు. అనంతరం దుర్గామాత విగ్రహాలకు పూజలు నిర్వహించి నిమజ్జనం చేశారు.ఈ కార్యక్రమంలో ఆయా ఉత్సవ సమితి సభ్యులు, భక్తులు, ప్రజా ప్రతినిధులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

మంథని : మంథనిలో దుర్గామాత విగ్రహాలను శని, ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు నిమజ్జన కార్యక్రమాన్ని డీజే సౌండ్స్ మధ్య నృత్యాలు చేస్తూ వైభవంగా నిర్వహించారు. దేవి శ రన్ననవరాత్రోత్సవాలను పురస్కరించుకొని ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహాలకు తొమ్మిది రోజుల పాటు అత్యంత భక్తి శ్రద్ధలతో భక్తులు పూజలు నిర్వహించారు. రోజుకో రూపంలో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేయడంతో పాటు భజన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంతో పాటు పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాలకు నిమజ్జన కార్యక్రమాన్ని డీజే సౌండ్స్ మధ్య నృత్యాలు చేస్తూ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఆలంకరించిన వాహనంపై అమ్మవారి విగ్రహాన్ని పుర వీధుల గుండా ఊరేగిస్తూ నిమజ్జనానికి తీసుకెళ్తుండగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి పూజలు నిర్వహించగా నిమజ్జన కార్యక్రమాన్ని దీక్షా పరులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దీక్షా పరులు, భక్తులు పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్ : దేవీ శరన్నవరాత్రోత్సవాలు ముగియడంతో దుర్గాదేవీ నిమజ్జనోత్సవం ఆదివారం సాయంత్రం గోదావరిఖనిలో ఘనంగా జరిగింది. పోయి రావమ్మ చల్లని తల్లీ అంటూ దుర్గాదేవి ప్రత్యేక పూజలు చేసి సాయంత్రం 5గంటలకు నగరంలోని వివిధ డివిజన్లల్లోని ద్వారకానగర్, తిలక్‌నగర్, రమేష్‌నగర్, మార్కండేయకాలనీ, ఎల్‌బీనగర్ తదితర కాలనీలోని దుర్గాదేవి విగ్రహాలను అందంగా ముస్తాబు చేసిన వాహనాలలో పెట్టి శోభయాత్రలు చేశారు. డప్పు చప్పుళ్ళు, నృత్యాలు చేస్తూ అమ్మవారిని గోదావరిలో నిమజ్జనం చేశారు. పలు కాలనీలలోని దుర్గాదేవి శోభయాత్రలు సోమవారం జరగనున్నాయి.

కళ్యాణ్‌నగర్ : దేవీ శరన్నవరాత్రుల చివరి రోజు అయిన ఆదివారం రామగుండం పారిశ్రామిక ప్రాంతాల్లోని పలు మండపాల్లో రామగుండం ఎమ్మెల్యే దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అశోక్‌నగర్, తిలక్ నగర్ ఏరియాల్లో దుర్గామాత మండపాల్లో పూజలు చేశారు. గోదావరిఖని చౌరస్తా వద్ద నిమజ్జనానికి తరలివెళతున్న అమ్మవారి విగ్రహాలకు స్వాగతం పలికారు.

దుర్గామాత కలశానికి రూ.26 వేలు



కలశాన్ని దక్కించుకున్న పెద్దపల్లి మాజీ వైస్ ఎంపీపీ ముత్యాల రాజయ్య

పెద్దపల్లి రూరల్ , అక్టోబరు 13 : మండలంలోని తుర్కలమద్దికుంట గ్రామంలో దుర్గమాతను ప్రతిష్ఠించి తొమ్మిది రోజుల అనంతరం నిమజ్జనం చేపట్టారు. గ్రామంలోని పోచమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మండపం వద్ద ఆదివారం పూజలు అందుకున్న పలు వస్తువులను కమిటి సభ్యులు వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా కలషం ను వేలం పాటలో పాల్గొని అత్యధికంగా రూ.26లకు మాజీ వైస్ ఎంపీపీ ముత్యాల రాజయ్య కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా కలశాన్ని మండప కమిటి సభ్యులు మాజీ వైస్ ఎంపీపీ ముత్యాల రాజయ్య కుటుంబ సభ్యులకు అందించారు.



ఓదెలలో..



గోదావరిఖని తిలక్‌నగర్‌లో...



ఖనిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

ఎన్టీపీసీలో ప్రమాదం.. కాంట్రాక్ట్ కార్మికుడికి గాయాలు

జ్యోతినగర్,అక్టోబరు13: రామగుండం ఎన్టీపీసీలోని సీఎస్సీ విభాగంలో ఆదివారం జరిగిన ప్రమాదంలో ఇదునూరి సదానందం అనే కాంట్రాక్ట్ కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. బంకర్‌లో సూట్ జామ్ పనులు నిర్వహిస్తున్న క్రమంలో పైనుంచి బొగ్గు పెల్లలు సదానందం కుడి చేతిపై పడడంతో నాలుగు వేళ్లు నుజ్జునుజ్జు అయ్యాయి. గాయపడిన సదానందంను కరీంనగర్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. సరైన రక్షణ లేకపోవడం వల్లనే ప్రమాదం జరిగిందని ఐఎఫ్‌టీయూ అనుబంధ కాంట్రాక్టు కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్ ఆరోపించారు. కార్మికుడికి పూర్తి స్థాయిలో వైద్యం అందించాలని శంకర్ డిమాండ్ చేశారు.

గుండా మల్లేష్‌కు ఘన నివాళి

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 13: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం గుండా మల్లేష్ ఢిల్లీలో గళమెత్తారని సీపీఐ నగర కార్యదర్శి కే కనకరాజు, కే స్వామి అన్నారు. గుండా మల్లేష్ 4వ వర్ధంతి సందర్భంగా భాస్కర్‌రావు భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు సార్లు సీపీఐ శాసన సభ్యునిగా పని చేశారని, మూడు సార్లు ఆసిఫాబాద్ నుంచి, ఒకసారి బెల్లంపల్లి నుంచి అసెంబ్లీకి ఎన్నికై సీపీఐ శాసనసభా పక్ష నాయకునిగా పని చేశారని, నిరుపేదల పెన్నిధిగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. రంగు శ్రీను, కందునూరి రాజరత్నం, తాళ్లపల్లి మల్లయ్య, శంకర్, ఓదమ్మ, రమ, మార్కపురి సూర్య, రేణికుంట్ల ప్రీతం పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్‌లో ఘనంగా దసరా ఉత్సవాలు

- ఏసీపీ గజ్జి కృష్ణ చొరవతో ప్రశాంతంగా వేడుకలు - ఊపిరి పీల్చుకున్న ప్రజలు

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 13: మండల కేంద్రంలో దసరా ఉత్సవాల నిర్వహణపై పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ ప్రత్యేక దృష్టి సారించడంతో విజయవంతమయ్యాయి. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. మండల కేంద్రంలో ఉత్సవాలు నిర్వహించే స్థలం తమదేనంటూ దళిత వర్గాలకు చెందిన వారు జమ్మి చెట్టు పెట్టేందుకు నిరాకరించడంతో గొడవలకు దారితీసింది. దీంతో మూడేళ్లుగా మండల కేంద్రంలోని ప్రజలు దసరా ఉత్సవాలకు దూరమయ్యారు. గతంలో కాల్వశ్రీరాంపూర్‌లో ఎస్సైగా పనిచేసిన ప్రస్తుత పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ ఈ సంవత్సరం అన్ని కులాల పెద్దలు, గ్రామస్థులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి దసరా ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. శనివారం సుమారు నాలుగు గంటలపాటు ఏసీపీ గజ్జి గ్రామస్థులతో కలిసి కృష్ణ రథోత్సవంలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు. దీంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. ఏసీపీకి పలువురు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఇక్కడి ప్రజలతో నాకు పరిచయాలు ఎక్కువ : ఏసీపీ గజ్జి కృష్ణ

మూడు సంవత్సరాలుగా దసరా ఉత్సవాలు ఆటంకం ఏర్పడుతున్న విషయం నా దృష్టికి వచ్చింది. నేనిక్కడ ఎస్సైగా గతంలో అందరితో మమేకమై పనిచేశాను. ఇక్కడున్న ప్రజలతో పరిచయాలు ఎక్కువ ఉన్న కారణంగా దసరా ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రజలతో కలిసి నేను కూడా పాల్గొన్నాను. దసరా ఉత్సవాలు ఎలాంటి గొడవలు జరగకుండా శాంతియుతంగా జరుపుకున్న ప్రజలందరికీ కృతజ్ఞతలు.



రథోత్సవంలో పాల్గొన్న ఏసీపీ గజ్జి కృష్ణ

ఈత చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

మంథని, అక్టోబరు 13: మంథని మున్సిపల్ పరిధిలోని బోయినిపేట ఏరియాలో ఈత చెట్టు పైనుంచి పడి గంగాపురి గ్రామానికి చెందిన తాటి శంకర్‌గౌడ్ అనే గీత కార్మికుడికి ఆదివారం తీవ్ర గాయాలయ్యాయి. ఈత కల్లు గీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు శంకర్‌గౌడ్ కింద పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు తరలించారు.

'ప్రజాస్వామిక తెలంగాణ స్వాప్నికుడు సాయిబాబా'

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 13: ప్రజాస్వామిక తెలంగాణ స్వాప్నికుడు సాయిబాబా అని తెలంగాణ ప్రజాఫ్రంట్ పెద్దపల్లి జిల్లా రచయితల సమాఖ్య, పౌరహక్కుల సంఘం, విరసం, రామగిరి, సాహితి వేదిక ఒక ప్రకటనలో తెలిపారు. ఒక రచయితగా ఒక ప్రొఫెసర్‌గా సాయిబాబా జీవితం చాలా ఆదర్శప్రాయమైనదని కొనియాడారు. సాయిబాబాకు నివాళులర్పించిన వారిలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాయకులు గుమ్మడి కుమారస్వామి, గాండ్ల మల్లేశం, విరసం నాయకులు బాలసాని రాజయ్య పౌరహక్కుల సంఘం నాయకులు మాదన కుమారస్వామి, పెద్దపల్లి జిల్లా రచయితల సమాఖ్య నాయకులు బుర్ర తిరుపతి, ఏలేశ్వరం వెంకటేశం నాయకులు బాలసాని కొమురయ్య, జిగురు రవీందర్, జింకల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అందరూ నేత్ర దానం చేయాలి



ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

ఓదెల, అక్టోబరు 13: ప్రతి ఒక్కరూ నేత్ర దానం చేయాలని సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి మేర్గు భీష్మచారి అన్నారు. మండల కేంద్రంలో ఇటీవల మృతిచెందిన నేత్ర దాత ముద్దసాని సమ్మయ్య ఇంటి వద్ద ఆదివారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మేర్గు భీష్మచారి మాట్లాడుతూ నేత్ర, అవయవ, శరీర దానాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. కొడుకు నేత్రాలను దానం చేసి ఇద్దరు అంధులకు చూపునిచ్చిన తల్లి రాజమ్మ, భార్య స్వరూపలను ఈ సందర్భంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బోడకుంట శంకర్, మాజీ ఉప సర్పంచ్ తీర్థాల కుమార్, బుద్దె ప్రభాకర్, బుద్దె చంద్రమౌళి, మల్లేశంతో పాటు పలువురు పాల్గొన్నారు.

స్టైఫండ్ విడుదల

మంథని, అక్టోబరు 13: జిల్లాలో న్యాక్ (ఉపాధి శిక్షణ సంస్థ)లో శిక్షణ పొందిన కార్మికులకు రూ.20 లక్షల స్టైఫండ్ విడుదలైనట్లు పెద్దపల్లి జిల్లా మానవ హక్కుల మండలి అధ్యక్షుడు ఎం.దిలీప్ కుమార్‌గౌడ్, కార్యదర్శి కృష్ణమూర్తిలు ఆదివారం తెలిపారు. ఐదు నెలలుగా జిల్లాలో ఉపాధి శిక్షణ పొందిన 350 మంది కార్మికులకు స్టైఫండ్ రావడం లేదని తమ దృష్టికి రావడంతో ఈవిషయాన్ని జాతీయ మానవ హక్కుల మండలి(ఎన్‌జీవో) అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు దృష్టికి తీసుకెళ్లి జిల్లా నాయక్ సంస్థ ఏడీ మాట్లాడి శిక్షణ పొందిన వారి కోసం రూ.20 లక్షలు వారి బ్యాంక్ ఖాతాలో జమ చేయించినట్లు తెలిపారు. ఈవిషయంలో తమకు సహకరించినందుకు కార్మికులు మానవ హక్కుల మండలికి కృతజ్ఞతలు తెలిపారు.

అశోకవిజయదశమి వేడుకలు

ఎలిగేడు, అక్టోబరు 13: కళింగ యుద్ధానంతరం చండా అశోకుడు ధమ్మ అశోకునిగా మారిన రోజు (ఆశ్వాయుజ దశమి)ని అశోకవిజయదశమిగా యావత్ ప్రపంచం జరుపుకుంటుందని బౌద్ధ ఉపాసకులు కెవెల్ మహాజన్ అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని నర్సాపూర్ గ్రామంలో విజయదశమి అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ 1956 అక్టోబర్ 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆరు లక్షల మంది తన అనుచరులతో కలిసి బౌద్ధాన్ని స్వీకరించారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ న్యాతరి శంకర్‌బాబు, డాక్టర్ కాంపల్లి సృజన్, కాంపల్లి దేవయ్య, కాంపల్లి అశోక్, కాంపల్లి రాఘవ, కలువల విజయ్‌చందర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

షీ టీంపై అవగాహన సదస్సు

సుల్తానాబాద్, అక్టోబర్ 13: సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి గ్రామంలో రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు చెందిన షీ టీం బృందం ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. షీటీం ఇన్‌చార్జి మల్లన్న ఆధ్వర్యంలో షీటీం మెంబర్ స్నేహలత సురేష్ తదితరులు షీ టీం అందిస్తున్న సేవల గురించి గ్రామంలోని మహిళలకు వివరించారు. ఈసందర్భంగా స్నేహలత మాట్లాడుతూ జన సమ్మర్థం ఎక్కువ ఉన్న ప్రాంతాలలో షీటీం బృందాలు ఎల్లవేళలా నిఘా వేస్తార న్నారు. మహిళలు, విద్యార్థినిలు, ఉద్యోగినిలు ఎలాంటి వేధింపులకు గురైనా 6303923700 నంబర్‌కు కాల్ చేయాలన్నారు. సైబర్ మోసాలకు గురయితే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న మాతృశ్రీ విద్యార్థులు

కమాన్‌పూర్, అక్టోబరు 13: కమాన్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని బాపూజీనగర్‌లోని మాతృశ్రీ విద్యాలయంలో 2003 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కేఎస్ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠాపన

రామగిరి, అక్టోబరు 13: మండలంలోని కల్వచర్ల గ్రామపంచాయితి పరిధీలోని ప్రశాంత్‌నగర్‌లో నూతనంగా నిర్మించబోయే అభయాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం నిర్వహించారు. స్థానికులు కంటిపూడి రామకృష్ణ, శ్రీనివాస్, సత్తిబాబు, కృష్ణారావు, వెంకటేశ్వరరావు, జివి ఆర్‌రెడ్డి, సందీప్, కుమార్‌స్వామి, తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

కర్షకరత్న అవార్డు గ్రహీతకు సత్కారం

రామగిరి, అక్టోబరు 13: మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన యాదగిరి శ్రీనివాస్‌ను శనివారం రేండ్లశారదకుమారస్వామి దంపతులు ఘనంగా సత్కరించారు. ఇటీవల తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్ కర్షక రత్న అవార్డును అందుకున్నాడు. మరిన్ని అవార్డులు సొంత చేసుకోవాలని ఆకాంక్షించారు.

పాస్టర్లకు సన్మానం

మంథని, అక్టోబర్ 13: ప్రపంచ పాస్టర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక సీయోను ప్రార్థన మందిరంలో పాస్టర్లు వల్లూరి ప్రభాకర్, పాస్టర్ మహేష్‌లను ఐఎంఐ సెక్రెటరీ అంకరి కుమార్ ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు జోసెఫ్, మంథని ప్రసాద్, అందె రమేష్, ఈర్ల సదానందం, దాసరి సదానందం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

సుల్తానాబాద్, అక్టోబర్ 13: మండలంలోని భూపతిపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. మంచరామి గ్రామానికి చెందిన సింగారపు రాజు(29) దసరాకు అత్తగారి ఊరైన భూపతిపూర్‌కు వచ్చాడు. ఆదివారం సాయంత్రం పనిమీద దుబ్బపల్లికి ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా కారు ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు భూపతిపూర్ మాజీ సర్పంచ్ అల్లుడిగా గుర్తించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్ల ఉన్నారు.